నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
10 | మహబూబ్‌నగర్, బుధవారం 2 ఏప్రిల్ 2025 | MAHABUBNAGAR NARAYANPET

రూ.ఆరు లక్షలు ఖర్చు చేశా..

ముక్కిడిగుండం శివారులో ఎని మిది ఎకరాల మామిడి తోటను కౌలు తీసుకున్నాను. 16 ఏండ్ల వయస్సు వున్న 245 చెట్లు వున్నాయి. తోట యాజమానికి ఇప్పటికే రూ. రెండు లక్షల యాభైవేలు చెల్లించాను. మూడు లక్షల దాక అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టాను. ఇప్పటి ఎని మిది సార్లు మందులు తెచ్చి స్ప్రే చేసినా పూత నిలవడం లేదు. కానీ తోటలో కాయలు కనబడటం లేదు. తోట చూస్తుంటే గుండె బరువెక్కి పోతున్నది.

– శివ, కౌలు రైతు, కల్వకోలు

వాతావరణంలో మార్పులతో దిగుబడి తగ్గింది

ఈ ఏడాది వాతావరణంలో భారీ మార్పులు వచ్చాయి. దీంతో తామర ఉధృత్తి పెరగడంతో పూత పిందెగా మారడంలో తగ్గుదల కనబడింది. అలాగే తేనె మంచుకు కూడా ఈ ఏడాది అధికంగా ఉంది. వాతావరణ వ్యత్యాసం మామిడి దిగుబడికి కారణంగా చెప్పవచ్చు.

– లక్ష్మణ్, ఉద్యానవన శాఖ డివిజన్ అధికారి

రైతులకు పరిహారం చెల్లించాలి

మామిడి రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నది. సీఎం సొంత జిల్లాతో పాటు, స్థానిక మంత్రి సొంత నియోజకవర్గంలో అత్యధికంగా మామిడి తోటలను రైతులు సాగు చేస్తున్నారు. గతంలో నేను సీఎం వద్ద ప్రత్యేక చొరువ తీసుకొని కొల్లాపూర్‌లో మామిడి మార్కెట్ ఏర్పాటుకు కృషి చేయడం జరిగింది. కానీ ప్రభుత్వం మారిన తర్వాత మామిడి మార్కెట్ ఏర్పాటు చేస్తే గత ప్రభుత్వానికి నాకు పేరు వస్తోందని ఈ ప్రాంత మామిడి రైతుల ఉసురు తీస్తున్నారు. సకాలంలో రైతులకు రుణమాఫీ చేయకుండా రైతు బంధు ఇవ్వకుండా రైతులను అప్పుల ఊబిలోకి నెట్టి వేశారు. ప్రభుత్వం వెంటనే మామిడి రైతులకు నష్టపరిహారం చెల్లించాలి.

– బీరం హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, కొల్లాపూర్

కొల్లాపూర్ మామిడికి దేశ, విదేశాల్లోనూ ఎంతో ప్రత్యేకతను కలిగి ఉన్నది. పండ్లల్లో రారాజు అయిన మామిడి ఈ ఏడాది చిన్నబోయింది. వాతావరణంలో వచ్చిన మార్పులకు తోడు ప్రభుత్వ నిర్లక్ష్యం రైతుల పాలిటశాపంగా మారింది. దీంతో మామిడి దిగుబడి తగ్గిపోవడంతో తెచ్చిన అప్పులు మీదపడుతున్నాయని మదనపడుతూ తనువు చాలిస్తున్న రైతుల సంఖ్య పెరుగుతున్నది. రాష్ట్రంలోనే అధిక సంఖ్యలో మామిడి సాగు చేస్తున్న సీఎం సొంత జిల్లాలో మామిడి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వచ్చిన దిగుబడిని కూడా దళారులు కొల్లగొడుతున్నారు. ప్రభుత్వం మామిడి రైతులను సంక్షోభం బయటపడేసేందుకు మార్గాలను అన్వేషించడం లేదు. గత ప్రభుత్వం రైతుల నుంచి నేరుగా ఎగుమతులను ప్రోత్సహించేది. దీంతో దిగుబడి తక్కువగా వచ్చినా మామిడి రైతులకు గిట్టుబాటు ధర లభించేది. కానీ ఈ ఏడాది ప్రభుత్వం మామిడి రైతుల ఇబ్బందులపై దృష్టి పెట్టలేదని రైతు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

– కొల్లాపూర్, ఏప్రిల్ 1

- వాతావరణంలో వచ్చిన మార్పులే కారణం
- 90మెట్రిక్ టన్నుల నుంచి 50కి దిగుబడి తగ్గిపోవచ్చం టున్న అధికారులు
- సామాన్యులకు రుచి ఇక ప్రియం
- అప్పులు మీద పడుతున్నా యని ఆందోళలో రైతాంగం
- పట్టిం చుకోని ప్రభుత్వం

మామిడికి దిగుబడి గండం

చినబోయిన రారాజు

రైతుల ఉసురు తీస్తున్న ప్రభుత్వం



పూతలేని మామిడి చెట్లు

కాత సరిగా రాకపోవడంతో రాలిపోయిన మామిడి పిందెలు

భారీగా తగ్గిన దిగుబడి

ఈ ఏడాది మామిడి పంట దిగుబడి భారీగా తగ్గిపోయింది. గత సంవత్సరం ఎకరాకు మూడు నుంచి నాలుగు టన్నుల దిగుబడి వస్తే ఈ ఏడాది ఒక్కటి నుంచి రెండు టన్నుల మధ్య దిగుబడి కుదించుకపోయింది. జిల్లాలోని అచ్చంపేట, అమ్రాబాద్, బల్మూరు, లింగాల, పదర, ఉప్పునుంతల పరిధిలో 2311.53 ఎకరాలు, కల్వకుర్తి, చారగొండ, వంగూరు, ఉర్కొండ, వెల్దండ పరిధిలో 4818.07 ఎకరాలు, నాగర్‌కర్నూల్, బిజినేపల్లి, తాడూరు, తెలకపల్లి, తిమ్మాజిపేటల పరిధిలో 2922.98 ఎకరాలు, కొల్లాపూర్, కోడేరు, పెద్దకొత్తపల్లి, పెంట్లవెల్లి మండలాల పరిధిలో 23789.33 ఎకరాలు మొత్తం జిల్లా వ్యాప్తంగా 33841.91 ఎకరాల్లో మామిడి తోటలను సాగు చేస్తున్నారు. సగటున 90 మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తున్న మామిడి పంట ఈ ఏడాదికి 40 నుంచి 50 మెట్రిక్ టన్నుల దిగుబడి పడి పోవచ్చున్నని ఉద్యానవన అధికారులు అంచనా వేస్తున్నారు.

వాతావరణంలో వచ్చిన అసాధారణ మార్పులు

వాతావరణంలో వచ్చిన అసాధారణ మార్పులు మామిడి రైతులను కుంగదీశాయి. సాధారణంగా మామిడి తోటలకు అనువుగా వాతావరణం ఉండాలంటే ఉష్ణోగ్రతలు 25 నుంచి 32 లోపు ఉండాలి. కానీ ఈ ఏడాది ప్రారంభం నుంచే 37 నుంచి 39 డిగ్రీల వరకు రావడంతో మామిడి తోటలను భారీగా దెబ్బ తీసిందని చెప్పవచ్చు. అంతేకాదు పగటి పూట ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటం, రాత్రి ఉష్ణోగ్రతలు బాగా పడిపోవడంతో పాటు పగటి పూట పొగ మంచు అధికంగా ఉండడంతో పూత సమయంలో తామర పురుగు ప్రభావం అధికం కావడంతో పూత రాలిపోయింది. కొత్తగా ఆకులు చిగురించి పూత రాలిపోతోంది. అధిక ఉష్ణోగ్రతల మూలంగా తేనె మంచు కూడా దిగుబడి తగ్గేందుకు కారణమైనదని ఉద్యానవన శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

కొండెక్కిన మామిడి

మామిడి కాత భారీగా తగ్గిపోవడంతో మామిడి ధర కూడా కొండెక్కింది. 20 కిలోల బాక్స్ ధర రూ. 2500, నుంచి రూ.5వేల వరకు మార్కెట్ పలుకు తోంది. ఈ ఏడాది సామాన్యులకు మామిడి పండ్ల రుచి మరింత ప్రియంగా మారనున్నది. అయితే మామిడి రైతుల కంటే దళారులు ఎక్కువ లాభం పొందుతున్నారు. మార్కెట్‌పై ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంతో దళారులు రింగుగా మారి రైతులను మోసం చేస్తున్నారు. దీంతో మామిడి పండ్లను అమ్మపోతే అడవిలో కొనబోతే కొరివిలా మారింది.

సీఎం సొంత జిల్లా అధికంగా సాగు అయ్యే మామిడి దిగుబడి తగ్గిపోవడానికి వాతావరణ వ్యత్యాసాలు తోపాటుప్రభుత్వ విధానాలు కూడా ఓ విధంగా కారణం. ప్రభుత్వం పూర్తి స్థాయిలో రుణా మాఫీ చేయక పోవడం, రైతుబంధు పూర్తి స్థాయిలో వేయక పోవడంతో రైతులు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చుకొని మామిడి తోటలపై పెట్టుబడి పెట్టారు. మామిడి తోటల్లో పూత నిలుపుకొనేందుకు ఒక్కో రైతు దాదాపు పదుల సార్లు స్ప్రే చేశారు. ఫర్టిలైజర్ ఖర్చులు, పొలం దున్నే ఖర్చులు, కూలీల ఖర్చులకు తోడు ముందస్తుగా కౌలు చెల్లించడంతో సగటున ఎకరా మామిడి తోటకు రూ.లక్ష నుంచి రెండు లక్షల దాకా ఖర్చు చేశారు. దీంతో దిగుబడి వచ్చిన రైతు అరకొర సంతోషంగా ఉంటే దిగుబడి లేని రైతు అప్పుల ఊబీలోకి పడి పోతున్నారు. పెద్దకొత్తపల్లి మండలం దేవుని తిమ్మాల పుల్ గ్రామానికి చెందిన రైతు కోన మోని శ్రీనివాసులు కల్వకుర్తి మండల పరిధిలో మామిడి తోటను కౌలు తీసుకున్నాడు. మామిడి తోటలో పంట దిగుబడి రాక పోవడంతో అప్పులు తీర్చలేనని గత శుక్రవారం ఆత్మహత్య చేసుకున్న ఘటన విధితమే. ప్రభుత్వం మొద్దు నిద్ర లేవాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

రైతులను ఆదుకోవాలి..

నష్టపోతున్న రైతులకు నష్ట పరిహారం అందించాలి. కేసీఆర్ సర్కారు లాగా 24గంటల కరెంట్ అందించగలిగితే రైతులు నష్టపోయే అవకాశం లేకుండే. వరి పైరు చేతికొచ్చే సమయంలో కరెంట్ కోతలు, భూగర్భజలాలు అడుగంటి పంటలు ఎండి పోతున్నాయి. వ్యవసాయాధికారులు పంటలను పరిశీలించి నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించి ఆదుకోవాలి.

– వెంకటయ్య రైతు, మార్చాల

మార్చాలలో కరెంటు కోతలతో నీళ్లు లేక ఎండిపోయిన వరి

కరెంట్ కోతలతో ఎండుతున్న పంటలు

కల్వకుర్తి రూరల్, ఏప్రిల్ 1 : వరి రైతులు అరిగోస పడుతున్నారు. రైతు సంక్షేమమే ధ్యేయమంటూ గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ సర్కారు రైతులకు చుక్కలు చూపిస్తున్నది. ఒకప్పటి కాంగ్రెస్ పాలనలోని కరెంట్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయని రైతులు వాపోతున్నారు. కల్వకుర్తి మండలం మార్చాలకు చెందిన వెంకటయ్య ఐదెకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తున్నాడు. చివరి దశకు పంట చేరుకున్న సమయంలో ఒకవైపు బోర్లు ఎండిపోవడం, మరోవైపు పగటి పూట కరెంట్ కోతలు విధించి రాత్రి వేళలో ఎప్పుడు ఇస్తున్నారో తెలియక తికమకపడుతున్నారు. కేసీఆర్ సర్కారులో వ్యవసాయానికి 24గంటల కరెంటు అందించి రైతు సంక్షేమానికి పాటుపడగా, రేవంత్ సర్కారు మాత్రం కరెంట్ కోతలతో రైతులను నష్టపోయేలా చేస్తున్నారని విమర్శిస్తున్నారు.

లైంగికదాడి నిందితులను కఠినంగా శిక్షించాలి

- మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

జడ్చర్ల, ఏప్రిల్ 1 : జడ్చర్ల నియోజకవర్గంలోని ఊర్కొండపేటలో శనివారం రాత్రి మహిళపై జరిగిన సామూహిక లైంగిక దాడి ఘటనను ఖండించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ మహబూబ్‌నగర్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి మంగళవారం ప్రకటనలో కోరారు. ఈ ఘటన అత్యంత దురదృష్టకరమని, జడ్చర్ల నియోజకవర్గంలో ఇటువంటి ఘటన చోటుచేసుకోవడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. లైంగిక దాడి ఘటనలో ఉన్న నిందితులను కఠినంగా శిక్షించాలని, పోలీసులు అన్ని రకాలుగా ఆధారాలను సేకరించి నిందితులు ఎవరైనా వదిలిపెట్టకుండా నిష్పక్షపాతంగా విచారణ చేయాలన్నారు. నేర స్థలంతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి కేసు పక్కాగా దర్యాప్తు చేయాలని పోలీసులను కోరారు. ప్రభుత్వం బాధితురాలిని ఆదుకోవాలని, అదేవిధంగా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

విద్యుత్ కంచెలో పడి గొర్రెల కాపరి మృతి

అచ్చంపేట రూరల్, ఏప్రిల్ 1: మండల పరిధిలోని ఘణపూర్ గ్రామ శివారులో ఓ వ్యవసాయ పొలంలో పంట కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెలో పడి గొర్రెల కాపరి మృతిచెందిన ఘటన మంగళవారం చోటుచేసుకున్నది. స్థానికులు, విద్యుత్ ఏఈ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘణపూర్ శివారులో అడవిపందుల బెడద కోసం వేరుశనగ పంటకు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ కంచెలో ప్రమాదవశాత్తు నల్లగొండ జిల్లా చందంపేట మండలం చాకెల్లి గ్రామానికి చెందిన నేతన వెంకటయ్య అనే గొర్రెల కాపరి పడి మృతిచెందాడు. వెంకటయ్య కొన్ని మేలుగా నల్లమల అడవిలో గొర్రెల మేత కోసం గ్రామ శివారులో మందను ఏర్పాటు చేసుకొని వాటిని సంరక్షిస్తూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామ శివారులో గొర్రెలు తప్పిపోగా వాటి కోసం వెళ్లిన వెంకటయ్య పంటకు ఏర్పాటు చేసిన కంచెను గమనించక అందులో పడి మృత్యువాత పడ్డారని తెలిపారు. మృతుడి భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆ అధికారిపై చర్యలేవీ..?

గద్వాల అర్బన్, ఏప్రిల్ 1 : జోగుళాంబ ఆలయంలో విధులు నిర్వహించే అధికారి తోపాటు ఆలయ అర్చకుడు అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు పెద్ద మొత్తంలో వచ్చాయి. పార్టీలు మొదలు కొని ప్రజా సంఘాలు, హిందూ దేవాలయ పరిరక్షణ సంఘాలు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. ఆలయ అర్చకుడిపై షోకాజ్ నోటీసులు అందజేశాయి. కానీ నేటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నాలుగు రోజుల కిందట మండల సభలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అవినీతిపై సభలోనే ప్రస్తావించినట్లు తెలిసింది. అదేవిధంగా మెదక్ ఎంపీ రఘునందర్‌రావు మంత్రి సురేఖకు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. స్పందించిన మంత్రి కొండా సురేఖ ఆలయ అధికారిపై విచారణ జరుగుతుందని, త్వరలో చర్యలు తీసుకుంటానని సమాధానం ఇచ్చినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై రాష్ట్ర అసిస్టెంట్ కమిషనర్ మదనేశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా, విచారణ జరుగుతున్నదని, కమిషనర్ పర్యవేక్షిస్తున్నారన్నారు. ఇప్పటికే ఆలయ అర్చకుడికి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

రాష్ట్రంలో బుల్డోజర్ల ప్రభుత్వం నడుస్తోందని బీఆర్ఎస్వీ, ఎస్ఎఫ్ఐ నాయకులు ఆరోపించారు. హైదరాబాద్‌సెంట్రల్ యూనివర్సిటీ భూములు కాపాడాలని మంగళవారం గద్వాల జిల్లా కేంద్రంలోని పీజీ కళాశాలలో, వనపర్తిలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో, మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ చౌరస్తాలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టడం తోపాటు పలు చోట్ల ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సర్కార్ వర్సిటీలో బుల్డోజర్లు పెట్టి మూగజీవాల ప్రాణాలు తీస్తోందని ఆరోపించారు. వారం రోజులుగా వర్సిటీ భూములు వేలం వేయొద్దని విద్యార్థులు ఉద్యమాలు, ఆందోళనలు చేస్తుండగా, అక్రమంగా లాఠిఛార్జీలు, అరెస్టులు చేయిస్తోందని ఆరోపించారు. అదేవిధంగా హెచ్‌సీయూలో జరుగుతున్న విద్యార్థుల ఆందోళనకు తరలివెళ్తున్న ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు విద్యార్థి నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు.

– నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఏప్రిల్ 1 :

హెచ్‌సీయూ భూములు కాపాడాలి

- బుల్డోజర్లు పెట్టి మూగజీవాల ప్రాణాలు తీస్తున్న రేవంత్‌రెడ్డి సర్కార్
- ఉమ్మడి పాలమూరులో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసిన బీఆర్ఎస్వీ, ఎస్ఎఫ్ఐ నాయకులు

వనపర్తిలోని అంబేద్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

మహబూబ్‌నగర్‌లో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గద్వాలలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

జనాలు తిడుతున్నారని జంతువులపై దౌర్జన్యమా..?

- మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట, ఏప్రిల్ 1 : హైడ్రా పేరుతో జనాల వద్దకు వెళితే పొట్టు పొట్టుగా తిడుతుండడం వల్లే మూగ జీవాలున్న ప్రాంతానికి వెళితే అవి ఎలాగో తిట్టలేవనే ఉద్దేశంతో రేవంత్‌రెడ్డి సర్కారు ఎలాగైనా భూములు లాక్కోవడమే పనిగా పెట్టుకున్నట్లుగా ప్రస్తుతం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జరుగుతున్న ఘటన స్పష్టం చేస్తున్నదని నారాయణపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. హెచ్‌సీయూ భూములను కాపాడుకునేందుకు వందల మంది విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తుండగా, ప్రభుత్వం తరఫున ఒక మంత్రి గానీ, అధికారి గానీ యూనివర్సిటీకి వెళ్లి విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకోవాల్సింది పోయి అక్రమంగా రాత్రికి రాత్రి వందల సంఖ్యలో బుల్డోజర్లను రప్పించి భూములను చదును చేసే పనులకు శ్రీకారం చుట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బుల్డోజర్లను అడ్డుకోబోయిన విద్యార్థులను అక్రమంగా అరెస్టు చేసి కేసులు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలకు ముందు ఇదే యూనివర్సిటీలో విద్యార్థులతో కలిసి ఫుట్‌బాల్ ఆడిన రేవంత్‌రెడ్డికి అప్పుడే హైదరాబాద్ సెంట్రల్ యూన్సివర్సిటీ భూములపై కన్ను పడిన విషయం 15నెలల తర్వాత ఇప్పుడిప్పుడే స్పష్టమవుతుందన్నారు. రేవంత్‌రెడ్డి తీరు ఇలాగే కొనసాగితే ఇదే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో తెలంగాణ ప్రజలు, విద్యార్థులు రాబోయే రోజుల్లో ప్రభుత్వాన్ని ఫుట్‌బాల్ ఆడటం ఖాయమన్నారు. ఇప్పటికైనా సెంట్రల్ యూనివర్సిటీ భూముల విషయంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

వ్యసనాలకు బానిసలై.. బ్లాక్ మెయిలింగ్

- ఆలయానికి వచ్చిన జంటలే టార్గెట్?
- ఊర్కొండపేట ఘటనలో వెలుగుచూస్తున్న కొత్తకోణం

కల్వకుర్తి, ఏప్రిల్ 1 : ఊర్కొండపేట లైంగిక దాడి ఘటనలో కొత్త కొత్త విషయాలు వెలుగు చూస్తున్నాయి. మహిళపై దాడికి పాల్పడ్డ వారి రూటే సపరేటు. గుడికి వచ్చిన జంటలను టార్గెట్ చేస్తూ.. వారు ఏకాంతంగా ఉన్న ఫొటోలను తీసి బ్లాక్ మెయిలింగ్ చేయడం, బెదిరించి డబ్బు వసూలు చేయడం, నగలు ఏవైనా ఉంటే లాక్కోవడం వంటి పనులకు పాల్పడేవారని గ్రామస్తుల నుంచి కొత్త విషయాలు వినిపిస్తున్నాయి. ఎవరి పైనా చెబితే.. ఫొటోలను మీ కుటుంబ సభ్యులకు చేరవేయడమో లేదా సోషల్ మీడియాలో పోస్టు చేస్తామని బెదిరించేవారట. మంగళవారం పోలీస్ ఉన్నతాధికారుల ఘటనా స్థలాన్ని పరిశీలించి లైంగిక దాడికి పాల్పడిన నిందితుల గురించి వారి క్రైం రికార్డును పరిశీలిస్తున్నామని చెప్పడం చూస్తుంటే.. గ్రామస్తుల అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయి.

ఆలయానికి రెండు వైపులా ఎత్తైన గుట్టలు..

ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి దేవాలయం ఊర్కొండ మండల కేంద్రానికి ఊర్కొండపేట గ్రామానికి మధ్యలో ఉన్నది. గుడి, గుడి ఎదురుగా, పక్కన పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా ఉంటుంది. అభయాంజనేయస్వామి ఆలయం శక్తిస్థలంగా ప్రసిద్ధి చెందడంతో ఉమ్మడి పాలమూరు జిల్లా తోపాటు, రంగారెడ్డి, హైదరాబాద్, నల్లగొండ జిల్లాల నుంచి భక్తులు వస్తుంటారు. గుడిలో ప్రతిరోజూ సత్యనారాయణస్వామి వ్రతాలు జరుగుతుంటాయి. మంగళ, శనివారాల్లో భక్తులు ఎక్కువ మంది వస్తుంటారు. రాత్రి వేళల్లో భజనలు జరుగుతుంటాయి. గుడి, పక్కన గుట్టలు ఉండడంతో ఏకాంతం కోరుకునే ప్రేమికులు, కొత్త జంటలు గుట్టలపైకి సహజంగానే వెళ్తుంటారు. ఏకాంతగా కనిపించిన జంటలను బెదిరించి డబ్బులు వసూలు చేయడం, ఫొటోలు తీసి బ్లాక్‌మెయిల్ చేసే వారని గ్రామస్తులు చెబుతున్నారు. ఇలా బ్లాక్ మెయిల్ చేసి, బెదిరింపులకు గురిచేసి డబ్బులు వసూలు చేసే గ్రూపులు ఐదారు వరకు ఉన్నాయని గ్రామస్తులు చెబుతున్నారు.

నిందితులకు క్రిమినల్ లా, పోక్సో చట్టాలపై..

లైంగిక దాడి ఘటనలో ఉన్న నిందితులకు క్రిమినల్ లా, పోక్సో వంటి చట్టాలపై అవగాహన ఉందని ఐజీ సత్యనారాయణ వెల్లడించడం చూస్తే.. గత రెండు మూడేండ్ల నుంచి నిందితులు జల్సాలకు అలవాటు పడి దేవుడి సన్నిధికి వచ్చిన భక్తులను బెదిరించి డబ్బులు వసూలు చేయడం అలవాటుగా మారిందని గ్రామస్తులు అంటున్నారు. ఎవరూ ఫిర్యాదు చేయక పోవడంతో మరింత ధైర్యంగా రెచ్చిపోయేలా తెలుస్తున్నది. క్రిమినల్ లా, పోక్సో వంటి చట్టాలపై అవగాహన ఉండడంతో మైనర్ల జోలికి వెళ్లకుండా, కేవలం భయపెట్టి డబ్బులు వసూలు చేయడం, నగలు గుంజుకోవడం వంటి పనులు చేశారని ఐజీ చెప్పారు. తెలివిగా ఆలోచిస్తూ వివాహితలను టార్గెట్ చేశారని తమ దర్యాప్తులో తెలిసిందని ఐజీ చెప్పారు. లైంగికదాడి విషయంలో పూర్తి స్థాయిలో విచారణ జరుపుతున్నాయని, తప్పు చేసిందెవరైనా కఠినంగా శిక్షిస్తామని ఆయన పేర్కొన్నారు. పూర్తి విచారణలో భాగంగా దేవాలయానికి వచ్చే భక్తులను బెదిరించి డబ్బులు వసూలు, బ్లాక్‌మెయిలింగ్ చేసి, నగలు లాక్కున్న వారి మరిన్ని పేర్లు బయటకు వచ్చే అవకాశమున్నదని గ్రామస్తులు అంటున్నారు.

వివరాలు సేకరిస్తున్న ఐజీ సత్యనారాయణ